క్లుప్తంగా

సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించాలి



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఓ నంబర్ 17ను వెంటనే రద్దు చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులు దీనస్థితిలో ఉన్నారని, ఉచిత ఇసుక దొరక్కపోవడంతో కార్మికులు పనులు లేక పస్తులు ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో నామద్దయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పెద్దాసుపత్రికి ఇద్దరు డిప్యూటీ సూపరింటెండెంట్లు


సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుతో డాక్టర్లు సీతారామయ్య, శ్రీరాములు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ఇద్దరు డిప్యూటీ సూపరింటెండెంట్లను నియమించారు. ఈ మేరకు సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఉత్తర్వులు ఇచ్చారు. యురాలజీ హెచ్ఓడీ డాక్టర్ సీతారామయ్య, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీరాములు డిప్యూటీ సూపరింటెండెంట్లుగా నియమితులయ్యారు. వీరు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆసుపత్రిలో పాలనా సౌలభ్యం కోసం ఇద్దరు డిప్యూటీ సూపరింటెండెంట్లను నియమించినట్లు డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఘనంగా బ్రహ్మర్షి పత్రీజీ జయంతి


ఆహార పొట్లాలను అందజేస్తున్న బైజుబాబు

కర్నూలు(హాస్పిటల్): పిరమిడ్ ధ్యాన మందిర్ వ్యవస్థాపకులు బ్రహ్మర్షి పత్రీజీ జయంతి వేడుకలు సోమవారం కర్నూలులో ఘనంగా నిర్వహించారు. గురుమహరాజ్ సదానంద మహరాజ్ యోగి ఆశ్రమం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి, రైల్వేస్టేషన్ వద్ద అనాథ పిల్లలు, రోగులకు అన్నదానం చేశారు. ఆశ్రమం సభ్యులు ఏఎస్ బైజుబాబు మాట్లాడుతూ.. ధ్యాన పిరమిడ్‌లను ప్రపంచ దేశాల్లో పత్రీజీ వ్యాప్తి చేశారని, అనేక మందిని ధ్యాన మార్గంలో నడిపించారని గుర్తు చేశారు.

పీఆర్ఓగా ఏ.వి.రమేష్‌బాబు



కర్నూలు (టౌన్): నగర పాలక సంస్థ ప్రజా సంబంధాల అధికారిగా(పీఆర్ఓ) ఏ.వి.రమేష్ బాబు నియమితులయ్యారు. నగరపాలక కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయనకు సోమవారం కమిషనర్ ఎస్.రవీంద్రబాబు నియమాక ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన నగరపాలక పీఆర్ఓగా పనిచేశారు.

మహిళను కాపాడిన వ్యక్తికి సన్మానం


రాజేష్‌ను సత్కరిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు (టౌన్): మహిళ ప్రాణాలు కాపాడిన యువకుడిని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ సోమవారం తన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. కల్లూరు ఎస్టేట్‌కు చెందిన జంగం నిర్మలమ్మ (50) కుటుంబ సమస్యలతో కేసీ కెనాల్‌లో దూకింది. ప్రవాహంలో కొట్టుకుపోతున్న ఆమెను అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలోని సీపీఎం కొట్టాలకు చెందిన రాజేష్ ప్రాణాలకు తెగించి కాల్వలోకి దూకి ఒడ్డుకు చేర్చాడు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ మహిళను కాపాడిన రాజేష్‌కు సోమవారం తన కార్యాలయంలో శాలువా కప్పి సన్మానం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ నీటి ఉధృతిని లెక్క చేయకుండా సాహసోపేతంగా మహిళను కాపాడటం అభినందించదగ్గ విషయమన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కోడుమూరు రూరల్ : మండలంలోని రామాపురం గ్రామ శివార్లలో హంద్రీనీవా కాల్వ వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం సిబ్బందితో దాడులు నిర్వహించి ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. రూ.40వేలు స్వాధీనం చేసుకోవడంతో పాటు, బోయ కృష్ణ, బాల మద్దిలేటి, జడల మనోహర్, కృష్ణయ్య, మాదన్నలను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన కూటమి

- జగనన్న హయాంలో విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఘనంగా విద్యా దినోత్సవం
- మౌలానా అబుల్ కలాం అజాద్‌కు ఘన నివాళ్లు

కర్నూలు (టౌన్): గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్య, వైద్య వ్యవస్థలో సమూల మార్పులు చేసి రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలిపారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుత కూటమి పాలనలో విద్య, వైద్య వ్యవస్థలు నీర్వీర్యం అయ్యాయని విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని కాన్ఫరెన్స్ హాలులో దేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మౌలానా చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యావేత్త సెక్యులర్ భావాలు కలిగిన మౌలానా అబుల్ కలాం అజాద్ దేశ విభజనను వ్యతిరేకించి, పాకిస్తాన్ ప్రధానమంత్రి పదవిని కూడా వద్దనుకొని భారత దేశంలో తొలి విద్యా శాఖ మంత్రిగా పనిచేశారని చెప్పారు. ఆయన హయాంలో ఎన్నో సంస్కరణలు చేపట్టారన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ఇంగ్లిషు మీడియం, ఐబి కరిక్యూలమ్, నాడు– నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పించారని వివరించారు. 17 వైద్య కళాశాలలను తీసుకొస్తే చేతగాని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెడికల్ సీట్లు వద్దంటూ కేంద్రానికి లేఖ రాశారని దుయ్యబట్టారు. నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. రాష్ట్రానికి చెందిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని అమలు చేయడంతో వందలాది విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా చదువుకున్నారని గుర్తు చేశారు. పేద విద్యార్థులు చదువులకు దూరం కాకుడదని అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంటు లాంటి పథకాలు అమలు చేశారని కొనియాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను దేశంలోనే ఆదర్శంగా నిలిపిన వ్యక్తి మాజీ సీఎం జగన్ అన్నారు. ఆయన హయంలో పేద, మధ్య తరగతికి చెందిన లక్షలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యా అవకాశాలు పొందారన్నారు. డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, స్టాండింగ్ కమి టీ సభ్యులు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


మౌలానా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ బీవై రామయ్య తదితరులు

మౌలానాకు ఘననివాళి

కర్నూలు(సెంట్రల్): భారతరత్న డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు ఎనలేనివని, ఆయన దేశంలో విద్యాభివృద్ధికి బాటలు వేసిన మహోన్నత వ్యక్తి అని డీసీసీ అధ్యక్షుడు పి.మురళీ కృష్ణ కొనియాడారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, అసిస్టెంట్ లైబ్రేరియన్ గోవింద రెడ్డి తదితరులు అబుల్ కలాం సేవలను కొనియాడారు.

కర్నూలు సిటీ: విద్యా రంగంలో సంస్కరణలు ప్రారంభించి, నూతన విధానానికి పునాది వేసిన మహనీయులు భారతరత్న మౌలానా అబుల్ కలాం అజాద్ అని ఉస్మానియా కాలేజీ ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్ అన్నారు. సోమవారం కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి అబుల్ కలాం సేవలను కొనియాడారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి

కర్నూలు కల్చరల్: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా ప్రమాణాలను మెరుగు పర్చాల్సిన అవసరం ఉందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. వర్సిటీ ఆన్‌లైన్ ద్వారా ‘ఉన్నత విద్య, సమాజం’ అనే అంశంపై ఆర్‌యూ పూర్వపు వీసీ ప్రొఫెసర్ నరసింహులు, ‘భిన్నత్వంలో ఏకత్వం భారతీయ భాషల కోసం జాతీయ విద్యా విధానం దృష్టి’ అనే అంశంపై కేంద్ర మంత్రిత్వ శాఖ భారతీయ భాషా సమితి అకడమిక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఫణి కృష్ణ ప్రసంగించారు. వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ పీ.ఎస్.షా వలిఖాన్ మాట్లాడుతూ అకడమిక్స్‌తో పాటు విద్యార్థులు ఉపాధి పొందేలా నైపుణ్యాలను పెంపొందించాలన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.లోకనాథ, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రీడాపోటీలు

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చిల్డ్రన్స్ డే పురస్కరించుకొని ఈ నెల 13, 14 తేదీల్లో అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు నిర్వహించనుస్తున్నట్లు జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హ్యాండ్‌బాల్, త్రోబాల్, వాలీబాల్, రైఫిల్ షూటింగ్ క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయని వెల్లడించారు.

14 నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా తదితరులు

కర్నూలు(సెంట్రల్): నాన్ కమ్యూనికబుల్ డీసీజెస్(ఎన్‌సీడీ) 3.0 సర్వేలో భాగంగా నవంబర్ 14 నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయాలని, తద్వారా ముందుగానే క్యాన్సర్‌ను గుర్తించి నివారించేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ‘క్యాన్సర్‌ను నివారించవచ్చు’ అనే పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. 14వ తేదీన జిల్లాలో నాన్ కమ్యూనికబుల్ డీసీజెస్ 3.0 సర్వేతోపాటు చిన్న పిల్లల్లో క్యాన్సర్ గుర్తింపు సర్వేలను పకడ్బందీగా చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ పాల్గొన్నారు.

57వ జాతీయగ్రంథాలయ వారోత్సవాలు..

ఈనెల 14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సెక్రటరీ ప్రకాష్, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క పాల్గొన్నారు.

రైతులకు తక్షణమే పెట్టుబడి సాయం ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తక్షణమే రైతులకు ఏడాదికి రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు అప్పులు చేసి పంటలు పండిస్తున్నారని, వారిని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. జిల్లాలో అధిక వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, పంటలు నష్టపోయిన వారికి వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కర్నూలులో రైతులు పండించిన ఉల్లి దిగుబడులను ప్రభుత్వం కొనుగోలు చేయలేకపోవడం అన్యాయమన్నారు. నాయకులు శ్రీనివాస రావు, రబియా, హేమంత్‌కుమార్, రామదాసు, స్వాములు, కృపమ్మ, మధు పాల్గొన్నారు.

17న యాదవ కార్తీక వనభోజనాలు


కరపత్రాలను విడుదల చేస్తున్న యాదవ నేతలు

కర్నూలు (అర్బన్): ఈనెల 17వ తేదీన (ఆదివారం) ఉదయం 10 గంటలకు శ్రీరూపాల సంగమేశ్వర స్వామి దేవాలయం (జగన్నాథగట్టు) నందు యాదవ కార్తీక మాస వనభోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు యాదవ నేతలు తెలిపారు. సోమవారం స్థానిక ఆర్ఆర్ హాస్పిటల్‌లో వనభోజన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలమద్దయ్య యాదవ్, ఏపీ రామయ్య యాదవ్, టి.శేషఫణి యాదవ్ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ యాదవుల సంస్కృతి, సాంప్రదాయాలను విస్తరిస్తూ, సమాజ నిర్మాణంలో ప్రధాన భూమిక నిర్వహిస్తున్న శ్రీకృష్ణ భగవానుడిని ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాల్సిన అవసరముందన్నారు. సింధూ నాగేశ్వరరావు యాదవ్, జీపీ కృష్ణమూర్తి, లింగన్న యాదవ్, వేణుగోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మల్లికార్జున సేవలు ఎనలేనివి


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వై.మల్లికార్జున అందించిన వైద్యసేవలు ఎనలేనివని ప్రస్తుత ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. ఈ నెల 6వ తేదీన డాక్టర్ మల్లికార్జున కృష్ణానగర్‌లోని తన నివాసంలో గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న ఆసుపత్రి అధికారులు సోమవారం ఆసుపత్రిలోని క్లినికల్ లెక్చర్ గ్యాలరీలో సంతాప కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ మల్లికార్జున సేవలను గుర్తుచేసుకున్నారు. ఆయనతో పాటు గతేడాది రోడ్డు ప్రమాదానికి గురై మరణించిన వైద్య విద్యార్థి ప్రవీణ్‌కుమార్‌కు సంతాపం తెలిపారు. ప్రాంతీయ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే సాయంత్రం వైద్య విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

పార్కింగ్ స్థలానికి బహిరంగ వేలం

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని స్థానిక గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో వాహనాల పార్కింగ్‌కు సంబంధించి సోమవారం సాయంత్రం నగరపాలక న్యూ కౌన్సిల్ హాలులో బహిరంగ వేలం నిర్వహించారు. పలువురు ఈ వేలంలో పాల్గొన్నారు. అత్యధికంగా పాట పాడి కే.మధు అనే వ్యక్తి రూ.5.6 లక్షలకు పార్కింగ్ స్థలాన్ని దక్కించుకున్నారు. నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ఆర్ఓ జునీద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు భార్గవ్, తిప్పన్న, రాజు, వందన పాల్గొన్నారు.

15న కార్తీక లక్ష దీపోత్సవం


కార్తీక లక్ష దీపోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సమితి సభ్యులు

కర్నూలు కల్చరల్: కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఈనెల 15వ తేదీన లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్లు సమితి కార్యాధ్యక్షులు ఇ.పద్మావతి తెలిపారు. సోమవారం సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దీపోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానిక వినాయక్ ఘాట్ కేసీ కెనాల్‌లో సామూహికంగా కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 15వ తేదీ సాయంత్రం 4 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 5 గంటలకు సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి వినాయక్ ఘాట్ వరకు శివపార్వతుల రథోత్సవం ఊరేగింపు, 6 గంటలకు ఆకాశ దీప ప్రజ్వలనం, 6.30 గంటలకు శివపార్వతుల అభిషేకం, కల్యాణం, 7.30 గంటలకు నాగఫణి శాస్త్రి బృందంచే గంగా హారతి, జ్వాలా తోరణం కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు. సమితి కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ నివారణపై నేడు సదస్సు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11 గంటలకు యాంటీ ర్యాగింగ్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.వి జయకుమార్ నాయుడు తెలిపారు. వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, జిల్లా పోలీసు ఉన్నతాధికారులు అతిథులుగా పాల్గొని ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

ఆదోని ఈఈగా హరి

కర్నూలు న్యూసిటీ: జిల్లాలోని ఆదోని విద్యుత్ డివిజన్ ఈఈగా బి.హరి బదిలీఅయ్యారు. ఈ మేరకు సీఎండీ సంతోషరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత కొంతకాలంగా ఆ పోస్టు ఖాళీగా ఉండడంతో ఇన్‌చార్జ్ ఈఈగా రాజేష్ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఆ పోస్టుకు అనంతపురం డీపీఈ ఈఈ బి.హరిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్ర బడ్జెట్‌లో యువతకు అన్యాయం



మాట్లాడుతున్న ఎన్.లెనిన్‌బాబు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర బడ్జెట్‌లో యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని, యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖకు కేవలం రూ.322 కోట్ల కేటాయింపులు చేయడం అన్యాయమని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు విమర్శించారు. సోమవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంపై యువత ఎన్నో ఆశలు పెట్టుకుందని, ఒక్కటీ నెరవేరేలా బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న చంద్రబాబునాయుడు అందుకు తగ్గ ప్రణాళికలు చూపలేదన్నారు. ఉద్యోగాలు ఇవ్వలేకపోతే నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని చెప్పారని అయితే అందుకు కేటాయింపులు లేవన్నారు. మెగా డీఎస్సీని నవంబర్‌లో విడుదల చేస్తామని చెప్పి ఇంతవరకు అతీగతీ లేదని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో జిల్లాకు 23 పతకాలు

కర్నూలు (టౌన్): అమరావతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కర్నూలు క్రీడాకారులు 23 పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను సోమవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

సిలబం పోటీల్లో పతకాలు

ఇటీవల గుంటూరులో సౌత్‌జోన్ స్థాయిలో నిర్వహించిన కర్రసాము పోటీల్లో కర్నూలు క్రీడాకారులు పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవేంద్ర పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కర్నూలు (టౌన్): మూడవ పట్టణ సీఐ శేషయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు పోలీసులు అభినందనలు తెలియజేశారు. సీఐ మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు పాటు పడతామన్నారు.

నగరపాలకలో పలువురికి స్థానచలనం

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్ర బాబు రెండవ విడతలో పలువురికి స్థానచలనం కల్పించారు. ఇటీవల రెవెన్యూ విభాగంలో అంతర్గత బదిలీలు చేపట్టిన తరువాత తాజాగా సోమవారం 8 మందికి అంతర్గతంగా బదిలీలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎస్.మన్సూర్‌బాషాను ఇంజినీరింగ్ విభాగం సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. అలాగే రెవెన్యూ సెక్షన్‌లో సూపరింటెండెంట్‌ను పట్టణ పేదరిక నిర్మూలన సంస్థకు, రెవెన్యూ విభాగం సూపరింటెండెంట్‌గా టీ.అబ్దుల్ వాదిజ్‌ను నియమించారు. సీ–1 తో పాటు పాలన సూపరింటెండెంట్‌గా కె.రామకృష్ణను, అక్కడ పనిచేసే ఏ.స్వర్ణలతను ప్రజారోగ్య విభాగం సూపరింటెండెంట్‌గా నియమించారు. కె.ఎల్.ఎస్.రెడ్డిని అర్బన్ రీసర్వే విభాగం సూపరింటెండెంట్‌గా, ఏ– 3 క్లర్క్‌గా పనిచేసే జి.సుహేయిల్ అహమ్మద్‌ను ఏ–2 క్లర్క్‌గా నియమించారు.

టిడ్కో గృహాలు కేటాయించాలి


కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలో నివశిస్తున్న తమకు సొంతిల్లు లేవని, నగర శివారులో నిర్మించిన టిడ్కో గృహ సముదాయంలో ఇళ్లు కేటాయించాలని పలువురు దరఖాస్తులు అందజేశారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అర్జీదారులు తమ దరఖాస్తులను కమిషనర్ రవీంద్రబాబుకు అందజేశారు. దరఖాస్తులను స్వీకరించిన కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదులో వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. శివారు కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో 18 దరఖాస్తులు వచ్చాయని, సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్య శాఖ అధికారి విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, మున్సిపల్ ఇంజినీర్ సత్యనారాయణ పాల్గొన్నారు.


ఫిర్యాదుల్లో కొన్ని..

- జనావాసాల మధ్య పశువులను పెంచుకుంటూ పరిసర ప్రాంతాలను అధ్వానంగా మారుస్తున్నారని వెంకటరమణ కాలనీ రోడ్డు నంబర్ 4లోని ప్రేమ్‌నగర్ కాలనీకి చెందిన పుల్లారెడ్డి, ఉమాపతి, సంజమ్మ వినతిపత్రం అందజేశారు.
- నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని బీఆర్ అంబేడ్కర్ కాలనీ వాసులకు ఇంటి, కొళాయి పన్నులు వేసి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ నాయకులు రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరావు అభ్యర్థించారు.
- జొహరాపురం, గోకారి నగర్, గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని సప్తగిరి కాలనీలో రహదారులు, మురుగు కాల్వలు, తాగునీటి సరఫరా చేయాలని సీపీఐ న్యూ డెమోక్రసీ పార్టీకి చెందిన నాయకులు వెంకటస్వామి, నాగేంద్ర, మద్దమ్మ విన్నవించారు.
- బాలాజీ నగర్‌లోని బంజారా కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నారని స్థానికులు రామిరెడ్డి, అన్వర్ హుసేన్, అంజి, ఎక్బాల్ ఉన్నీసా ఫిర్యాదు చేశారు.
- జ్యుడీషియల్ కాలనీ, మారుతీ నగర్ కాలనీ మధ్య ఉన్న పార్కులో రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు చాంద్ హుసేన్, పుల్లారెడ్డి, నాగేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి కోరారు.
- వై–జంక్షన్ సమీపంలోని అశోక్ గార్డెన్స్‌కు తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని స్థానికులు కృష్ణ, ప్రణీత్, రాఘవేంద్రరెడ్డి విన్నవించారు.
- కొత్తపేటలోని తమ ఇళ్ల మధ్య మాంసం దుకాణం ఏర్పాటు చేసి వ్యర్థాల ద్వారా అపరిశుభ్రం చేస్తున్నారని బి.విజయ్‌కుమార్, వీరేంద్ర కుమార్ ఫిర్యాదు చేశారు.
- నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీ గణేష్ నగర్‌లో తాగునీటి సరఫరా సక్రమంగా లేదని స్థానికులు అన్నపూర్ణమ్మ, రమేష్ కుమార్‌రెడ్డి, అభ్యర్థించారు.

కార్తీక దీపం.. దివ్య తేజం


ప్రత్యేక అలంకరణలో గౌరీ శంకరుడు


ఇ.తాండ్రపాడులో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


దేవనగర్ ఆలయంలో శివలింగం రూపంలో వెలిగించిన దీపాలు

కర్నూలు కల్చరల్: కార్తీక మాసం సోమవారం పురస్కరించుకొని నగరంలోని శైవాలయాల్లో సోమవారం విశేష పూజలు జరిగాయి. మహిళలు కార్తీక స్నానాలను ఆచరించి ఆలయాలను సందర్శించి కార్తీక దీపాలను వెలిగించి ఆకాశ దీప దర్శనం చేసుకున్నారు. కార్తీక వన భోజన కార్యక్రమాలు జరిగాయి. నగరంలోని సప్తగిరి కైలాసగిరి ఆలయం, దేవనగర్ సత్యనారాయణ స్వామి ఆలయం, నెహ్రూనగర్ సాయీశ్వరాలయం, అశోక్‌నగర్, శ్రీరామ్‌నగర్ శివాలయాలు, బుధవార పేట ఈశ్వరాంజనేయ స్వామి ఆలయం, వైద్య కళాశాల మైదానం నీలకంఠ స్వామి ఆలయం, ఓల్డ్‌సిటీ నగరేశ్వర స్వామి ఆలయం, లలితా పీఠం, నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలోని మహాగౌరీ శంకర ఆలయం, జగన్నాథగట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.


సప్తగిరి నగర్ శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు